క్లుప్తంగా

శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో ఈనెల 23 నుంచి 25 వరకు నిర్వహించే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గోపాలకృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, మండల అధికారులు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఓ, మహిళా సంఘాల సభ్యులకు స్వచ్ఛభారత్ మిషన్, ఎస్‌బీఎం ప్లస్ కార్యక్రమాల అమలుపై మండల, గ్రామస్థాయి కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. శిక్షణ తరగతులకు జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి హాజరుకానున్నట్లు వెల్లడించారు.

నీటిని వృథా చేయొద్దు

మామడ: నీటిని వృథా చేయకుండా అవసరం మేరకే వాడుకోవాలని భూగర్భ జలవనరుల శాఖ అధికారి శ్రీనివాస్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కొరిటికల్ ఉన్నత పాఠశాలలో రిలయన్స్ ఫౌండేషన్, భూగర్భ జలవనరులశాఖ ఆధ్వర్యంలో జలవనరుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటిని పరిరక్షించుకునేందుకు ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

అడవులను రక్షించుకోవాలి



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అటవీ సిబ్బంది

కడెం: అడవులను సంరక్షించుకోవడం అందరి బాధ్యత అని కడెం ఎఫ్ఆర్వో అనిత అన్నారు. మంగళవారం అటవీ దినోత్సవం పురస్కరించుకొని కడెంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కడెం సర్పంచ్ అనూష, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి రాజేశ్, డీఆర్వో ప్రకాశ్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉగాది వేడుకల్లో పాల్గొనాలి

నిర్మల్‌టౌన్: పట్టణంలోని ఆర్కే కన్వెన్షన్ హాలులో బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే ఉగాది వేడుకల్లో అందరూ పాలుపంచుకోవాలని నిర్మల్ ఉగాది ఉత్సవ సమితి అధ్యక్షుడు డాక్టర్ కృష్ణంరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం నారాయణగౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. పంచాంగ శ్రావణం, స్వామీజీ ప్రవచనం, సాంస్కృతిక, తెలంగాణ జానపద ఆట పాటలు ఉంటాయన్నారు. కళాకారులు చాకేటి రవి, వరంగల్ శీనన్న అలరిస్తారని పేర్కొన్నారు.

రోడ్డు పనులు పరిశీలన

తానూరు: మండలంలోని కోలూరు గ్రామంలో ఉపాధిహామీ నిధులు రూ.25 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. ఉమ్రి(కే)లో పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీ, పల్లెప్రకృతివనం సందర్శించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి వెంట ఎంపీవో మోహన్‌సింగ్, ఈజీఎస్ ఏపీవో గంగాధర్, కార్యదర్శి వినయ్, మారుతి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

తానూరు: మండల కేంద్రంలోని భవిత విద్యావనరుల కేంద్రంలో మంగళవారం దివ్యాంగులైన విద్యార్థులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. 20 మందికి పరీక్షలు చేసి మందులు అందించినట్లు ఫిజియోథెరపిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. ప్రతి మంగళవారం భవిత విద్యావనరుల కేంద్రంలో నిర్వహించే వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐఆర్‌టీ భూమన్న, రాము, పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు ఉగాది సంబరాలు



నిర్మల్ వాసవి ఉన్నత పాఠశాలలో..



నిర్మల్‌రూరల్: కద్తాల్ పాఠశాలలో ఉగాది పచ్చడితో విద్యార్థులు, ఉపాధ్యాయులు

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంతోపాటు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం ముందస్తుగా ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఉగాది పచ్చడి తయారు చేసి విద్యార్థులకు పచ్చడి రుచి చూపించారు.

దస్తురాబాద్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఈశ్వర్, ఉపాధ్యాయులు వెంకటరమణ, కోటేశ్, రమణ, నరేశ్, భూమన్న, విజయలక్ష్మి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని విఠపూర్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ముందస్తు ఉగాది పండుగ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఉగాది పచ్చడి తయారు చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీరమేశ్, ప్రధానోపాధ్యాయుడు భీమన్న, సురేఖ, రవి తదితరులు ఉన్నారు.

ముధోల్: మండల కేంద్రంలోని రబీంద్ర, శ్రీసరస్వతీ శిశుమందిర్, అక్షర పాఠశాలల్లో ఉగాది వేడుకలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు సాయినాథ్, సారథిరాజు, సుభాశ్ తదితరులు ఉన్నారు.

కుభీర్: మండల కేంద్రంలోని అభ్యాస పాఠశాలలో మంగళవారం ముందస్తుగా ఉగాది పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించి ఉగాది పచ్చడి తయారు చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.నరేశ్, కరస్పాండెంట్ సతీశ్ తదితరులు ఉన్నారు.



కుంటాల: విఠాపూర్‌లో పచ్చడి ఇస్తున్న సర్పంచ్



కుభీర్ అభ్యాస పాఠశాలలో చిన్నారులు

పుస్తకపఠనంతో భాషా నైపుణ్యాలు



మాట్లాడుతున్న డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్‌రూరల్: ప్రభుత్వం అందిస్తున్న పుస్తకాలను చదివితే విద్యార్థుల్లో అక్షర పరిజ్ఞానం, చదవడం, రాయడం, ఆలోచించడం వంటి భాషా నైపుణ్యాలు పెంపొందుతాయని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బైల్‌బజార్ రైతువేదికలో లైబ్రరీ పుస్తకాలను, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. మనఊరు–మనబడి కింద తొలి విడతలో ఎంపిక చేసిన 260 పాఠశాలలకు గాను 152 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో (ఒక్కో పాఠశాలకు 259 పుస్తకాలు) అందిస్తున్నామని పేర్కొన్నారు. రూమ్ టు రీడ్ అనే స్వచ్ఛంద సంస్థ, నేషనల్ బుక్ ట్రస్ట్ సంయుక్తంగా ఈ పుస్తకాలను అందించారన్నారు. నేషనల్ బుక్ ట్రస్ట్ వారు 30 పుస్తకాలు చొప్పున పీ,క్యూ,ఆర్,ఎస్ అనే నాలుగు రకాలుగా మొత్తం 120 పుస్తకాలు, రూమ్ టు రీడ్ సంస్థ వారు 120 చిన్నపుస్తకాలు, 12 పెద్దపుస్తకాలు, ఏడు గోడపత్రికలు కలిపి అందించిన మొత్తం 259 పుస్తకాలను ప్రధానోపాధ్యాయులు పాఠశాలలో జాగ్రత్తగా భద్రపరిచి విద్యార్థులతో చదివించాలన్నారు. ఈ పుస్తకాలను భద్రపరిచేందుకు త్వరలోనే వుడెన్‌రాక్స్ కూడా జిల్లాకు చేరుకుంటాయని డీఈవో పేర్కొన్నారు. ఇందులో జిల్లా సెక్టోరియల్ అధికారులు నర్సయ్య, ప్రవీణ్‌కుమార్, ఎంఈవో శంకర్, సీఆర్పీలు ఫిరోజ్, సుధాకర్, డీఆర్పీలు మురళీధర్, వనజ, సంగీత తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన పంటలు పరిశీలన



మొక్కజొన్న పంట పరిశీలిస్తున్న ఏడీఏ సుజాత

పెంబి: ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను మంగళవారం ఖానాపూర్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత పరిశీలించారు. మండలంలోని ఇటిక్యాల్, పస్పుల, పుల్గంపాండ్రి, హరిచంద్‌తాండ గ్రామాల్లో నష్టపోయిన పంటల వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడారు. నష్టం వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో రాజ్‌కుమార్, రైతులు రవీందర్, సురేందర్, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

సాక్షి ఎఫెక్ట్..



రవి కూతురుకు సాయం అందిస్తున్న మిత్రులు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలో రంగపేటకు చెందిన పాలాస రవి అనారోగ్యంతో బాధపడుతూ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ విషయమై ఈనెల 20న సాక్షిలో 'దాతలు సాయం అందించరూ' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి పలువురు స్పందిస్తున్నారు. మంగళవారం ఖానాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999–2000లో పదో తరగతి చదివిన మిలీనియం బ్యాచ్ ఆధ్వర్యంలో పోగు చేసిన రూ.పది వేలను బాధిత కుటుంబసభ్యులకు వారి నివాసంలో అందించారు. కార్యక్రమంలో బాధితుడి కూతురు జ్ఞాపిక, గ్రామపెద్దలు సాగి పెద్ద లక్ష్మణ్‌రావు, నవీన్ యాదవ్, మిత్రబృందం సభ్యులు ఉన్నారు.

జనచైతన్యయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

ఖానాపూర్: సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించే జనచైతన్యయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆ పార్టీ నాయకులు మండలంలోని తర్లపాడ్‌లో ఆవిష్కరించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈనెల 23న ఆదిలాబాద్‌లో వంద బైకులు, బస్సుతో పారంభమయ్యే యాత్ర అదే రోజు సాయంత్రం నిర్మల్ జిల్లా రాణాపూర్‌కు చేరుకుంటుందన్నారు. అనంతరం నిర్మల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట బహిరంగ సభ నిర్వహిస్తామని పేర్కొన్నారు. 24న కడెం, దస్తురాబాద్, ఇందన్‌పల్లి మీదుగా ఉట్నూర్ నుంచి కాగజ్‌నగర్‌కు వెళ్తుందన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం నూతన్‌కుమార్, బొమ్మెన సురేశ్, ఖానాపూర్ ఏరియా కార్యదర్శి డాకూరి తిరుపతి, నర్సయ్య, నారాయణ, భూమన్న, నర్సయ్య, సత్తవ్వ, సుశీల, లక్ష్మి తదితరులు ఉన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీలు

ఖానాపూర్: ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులపై బుధవారం నుంచి గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మల్లేశ్ తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పనుల వివరాలు తనిఖీ బృందానికి అందజేశామన్నారు. తనిఖీల అనంతరం పంచాయతీల్లో గ్రామసభలు, తర్వాత మండల కేంద్రంలో ప్రజావేదిక నిర్వహించి వివరాలు వెల్లడిస్తామన్నారు. ఎంపీపీ మోహిద్, ఎస్ఆర్పీలు రాఘవ, మహేశ్, ఎంపీఓ చంద్రశేఖర్, వెంకాగౌడ్, తదితరులు ఉన్నారు.

సందర్శిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ

- ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు పరిశీలించిన రాష్ట్ర పరిశీలకులు



జాఫ్రాపూర్‌లో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

లక్ష్మణచాంద: సోన్ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు చంద్రశేఖర్‌రెడ్డి సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు, ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమం అమలు పరిశీలించారు. ఈసందర్భంగా పాఠశాలల్లో పరిశుభ్రత, మధ్యాహ్న భోజనం అమలు విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట పలువురు సభ్యులు రవిగౌడ్, పరమేశ్వర్, రవికిరణ్ ఉన్నారు.

గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించండి

- ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి
- సాదాసీదాగా నిర్మల్ మండల సర్వసభ్య సమావేశం



గంగాధర్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ, సభ్యులు

నిర్మల్‌రూరల్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవహరిస్తూ గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో నిర్మల్ మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో రూ.6 కోట్ల 20 లక్షలతో చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణాలు ఈనెలాఖరుతో పూర్తవుతాయన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయా అంశాలను చర్చించారు.

ఎంఈఓ కస్తూరి శంకర్ మాట్లాడుతూ మన ఊరు–మనబడిలో భాగంగా సర్కారు బడులను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. పదో తరగతిలో వందశాతం ఫలితాలను సాధించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. వ్యవసాయాధికారి వసంతరావు మాట్లాడుతూ మండలంలో రైతుబంధు ద్వారా రూ.8 కోట్ల 54 లక్షలను రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందన్నారు. 18 మందికి రైతుబీమా చెక్కులను(ఒక్కొక్కరికి రూ.ఐదు లక్షలు) అందించామన్నారు. రైతులు ఆయిల్‌ఫాం సాగు కోసం ముందుకు రావాలని సూచించారు.

విద్యుత్ ఏఈ కిశోర్‌కుమార్ మాట్లాడుతూ కొందరు రైతులు పంట చుట్టూ విద్యుత్ తీగలు అమర్చడం వలన పలువురు మృత్యువాత పడుతున్నారని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయంగా సోలార్ కంచె ఏర్పాటు చేసుకునేలా ప్రజాప్రతినిధులు గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. తహసీల్దార్ ప్రభాకర్ మాట్లాడుతూ రేషన్ దుకాణాల ద్వారా మండలంలోని 14,067 మందికి రేషన్ బియ్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. అంతకుముందు ముజాపూర్ పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బోండ్ల గంగాధర్‌ను సభ్యులు సన్మానించారు. ఇందులో ఎంపీడీవో సాయిరాం, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోషణ్ పక్వాడపై అవగాహన



తానూరు: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శారద



సర్నాపూర్(జి)లో అవగాహన కల్పిస్తున్న టీచర్లు

తానూరు: ప్రతిఒక్కరూ పోషకాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద అన్నారు. పోషణ్ పక్వాడలో భాగంగా మంగళవారం మండలంలోని నంద్గాం, బోంద్రట్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వచ్చే నెల మూడో తేదీ అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్నాపూర్(జి): పోషణ్ పక్వాడలో భాగంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాల ఉపయోగాలు, గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ల మండలాధ్యక్షురాలు గంగామణి, టీచర్లు అరుణ, సునీత, గంగవ్వ, సులోచన పాల్గొన్నారు.

కుంటాల: చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మివిశారద పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పెంచికల్‌పాడ్, విఠపూర్, ఓలా, అందకూర్, సూర్యాపూర్, మోదిపూర్ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిరుధాన్యాలతో చేసిన వంటకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

లోకేశ్వరం: పోషకాలతో కూడిన ఆహారం తీసుకొని మహిళలు ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత అన్నారు. మంగళవారం మండలంలోని బామ్నికే, బాగాపూర్, ధర్మోర, వట్టోలి, పంచగుడి, మొహళ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముధోల్ సీడీపీవో శ్రీమతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను శుభ్రంగా ఉంచి పోషకాహారం తీసుకునేలా మహిళలను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శారద, అంగన్‌వాడీ కార్యకర్తలు విమల, మత్తవ్వ, లలిత, వసంత, లక్ష్మీ, పరహణ, ప్రభ ఉన్నారు.

లక్ష్మణచాంద మండలంలో..

లక్ష్మణచాంద: పోషణ్ పక్వాడలో భాగంగా మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిరుధాన్యాల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది లక్ష్మి, ఎంపీడీవో మోహన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి, సర్పంచ్ హైమావతి, ఎంపీటీసీ రమ, పలువురు అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు కుభీర్‌లో కుస్తీ పోటీలు

కుభీర్: ఏటా మాదిరి ఈసారి కూడా ఉగాది పండుగ రోజు మండల కేంద్రంలో విఠలేశ్వర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నార పరశురాం ఓ ప్రకటనలో తెలిపారు. మల్లయోధులు బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమయ్యే పోటీల్లో పాల్గొనాలని కోరారు. ప్రథమ బహుమతి రూ.ఐదువేలు, ద్వితీయ బహుమతి రూ.మూడు వేలు అందిస్తామన్నారు.

బాలకవుల సమ్మేళనం

తానూరు: ఉగాది పండుగ సందర్భంగా మండలంలోని బెల్‌తరోడా జిల్లా పరిషత్ పాఠశాలలో బాల కవుల సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు చిరుకవితలు, పాటల ద్వారా నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వీడ్కోలు హంగామా



లోకేశ్వరంలో విద్యార్థుల ప్రదర్శన



కుంటాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

లోకేశ్వరం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు, నాటికలు, మిమిక్రీ ఆకట్టుకున్నాయి. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. గతేడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన లోకేశ్, అర్జున్‌కు విశ్రాంత ఉపాధ్యాయుడు సుదర్శన్‌రెడ్డి పారితోషికం అందించారు. వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకొని పదో త రగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువు కో వా లని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేశ్‌కుమార్, ఎస్ఎంసీ చైర్మన్ రమేశ్, భూమేశ్, ఉపాధ్యాయులు భూమేశ్, గణేశ్‌వర్మ, ముత్తన్న, కాశీరాం తదితరులు ఉన్నారు.

కుంటాలలో..

కుంటాల: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గజపల్లి నర్సయ్య, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బూత్ స్వశక్తి కరణ్ విజయవంతం చేయాలి

ఖానాపూర్: గ్రామస్థాయిలో బీజేపీ బలోపేతంలో భాగంగా చేపట్టిన బూత్ స్వశక్తి కరణ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పడాల రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని తర్లపాడ్ గ్రామంలో జరిగిన బూత్ సమావేశానికి హాజరై మాట్లాడారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు టేకు ప్రకాశ్, పెద్ది రమేశ్, మేకల వెంకటేశ్, రాజరెడ్డి ఉన్నారు.

23న ప్రత్యేక సమావేశం

ఖానాపూర్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 23న గురువారం నిర్వహించే పంచాయతీ అవార్డుల సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరవాలని ఎంపీడీవో మల్లేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో చేసిన పలు అబివృద్ధి కార్యక్రమాలపై అవార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వాటిపై తొమ్మిది బృందాలతో సర్వేలు చేసి అవార్డులకు ఎంపిక చేశారన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

దస్తురాబాద్: సీసీరోడ్డు, డ్రెయినేజీలు వంటి అభివృద్ధి పనుల్లో తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. అనంతరం బూత్కూర్, మున్యాల గ్రామాల్లో చేపడుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో అనిల్, శివయ్య, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద ఆవాసం సందర్శన

భైంసాటౌన్: భైంసాలోని వివేకానంద ఆవాసాన్ని బాలల సంక్షేమ సమితి జిల్లా చైర్మన్ వాహిద్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆవాసంలో పలు రికార్డులు పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఆర్‌బీఎస్‌కే వైద్యులు అవినాశ్, బాలల పరిరక్షణ అధికారి దేవిమురళి, సీపీవో రాజు, ఆవాసం అధ్యక్షుడు శైలేశ్, ఆవాసం ప్రముఖ్ లింగారెడ్డి తదితరులు ఉన్నారు.

బీజేపీ ఐటీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా తిరుమలాచారి

సారంగపూర్: బీజేపీ ఐటీసెల్ జిల్లా అధ్యక్షుడిగా, సోషల్ మీడియా కన్వీనర్‌గా మండలంలోని జామ్ గ్రామానికి చెందిన తిరుమలాచారిని నియమిస్తూ ఆ పార్టీ ఐటీ సెల్ రాష్ట్ర కన్వీనర్ వెంకటరమణ మంగళవారం నియమాక పత్రం అందజేశారు. ఈసందర్భంగా తిరుమలా చారి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన కన్వీనర్ వెంకటరమణ, జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, అయ్యన్నగారి భూమయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

కంటివెలుగు సద్వినియోగం చేసుకోవాలి

లోకేశ్వరం: కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి సందీప్ అన్నారు. మంగళవారం మండలంలోని కన్కపూర్ గ్రామంలో కంటివెలుగు వైద్య శిబిరాన్ని సర్పంచ్ సాలాయి నరేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురికి కంటి అద్దాలు అందించారు. ఎంపీటీసీ నర్సవ్వ, గంగాధర్, భూమేశ్, వైద్యసిబ్బంది గంగన్న, భోజన్న, ఆరోగ్య కార్యకర్త దీప పాల్గొన్నారు.